విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 22, ఆగస్టు 2023

ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్ల తొలగింపు శోచనీయం

- సీఈఓపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను స్వాగతిస్తున్నాం.
- పదవి కాంక్షతో నైతిక విలువలకు తిలోదకాలిస్తున్న విశ్వేశ్వర రెడ్డి
- సీపీఐ పార్టీ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు డి.జగదీష్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జగదీష్

విశాలాంధ్ర- ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్లు తొలగింపు, దొంగ ఓట్లు, నకిలీ ఓట్లు చేర్పించిన సంఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి ఈ సంఘటనకు పాల్పడిన ఉరవకొండ నియోజకవర్గం ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డిపై చర్యలు తీసుకోవడాన్ని సీపీఐ పార్టీ స్వాగతిస్తుందని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు డి.జగదీష్ పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండ లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికలలో గెలవలేమని తెలిసి ఉరవకొండ వైఎస్ఆర్సిపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ విశ్వేశ్వర రెడ్డి అధికారులను, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి కక్కుర్తి పనులకు పాల్పడం సిగ్గుచేటు అన్నారు. పదవి కోసం విశ్వేశ్వరరెడ్డి ఏమైనా చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. గతంలో సిపిఐ పార్టీలో ఉంటూ ఎంపీ సీటు కోసం స్నేహితులతోనూ, పార్టీ నాయకులతోను తగాదా పడి పార్టీని వదిలి పెట్టాడని, అనంతరం సిపిఎం పార్టీలో చేరిన విశ్వేశ్వర రెడ్డికి అత్యధిక ప్రాధాన్యత కూడా ఇవ్వడం జరిగిందని, 2004లో ఎమ్మెల్యే సీటు కూడా ఆ పార్టీ ఇవ్వడం జరిగిందని ఓడిపోయిన తర్వాత పదవి కోసం ఆ పార్టీని వదిలిపెట్టి కాంగ్రెస్ పార్టీలోనూ , అనంతరం వైఎస్ఆర్సిపి పార్టీలో చేరి పదవి కాంక్షతో అధికార దాహంతో సొంత సోదరుడు మధుసూదన రెడ్డిని సైతం తగాదా పడి దూరం చేసుకున్నాడని, అంతేకాకుండా సమీప బంధువు ఆయన ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని సైతం దరిచేరకుండా చేసుకున్నారని ఆరోపించారు. తన తండ్రి నారాయణరెడ్డి పనిచేసిన సిపిఐ పార్టీకి కూడా ఉరవకొండ నియోజకవర్గంలో గండి కొడుతూ పార్టీలో పని చేస్తున్న అనేకమంది వ్యక్తులను ప్రలోభాలు పెట్టి వైఎస్ఆర్సిపి పార్టీలో చేర్చుకోవడం జరిగిందన్నారు. విశ్వేశ్వరరెడ్డి కేవలం పదవి కోసం ఎన్నికలలో గెలవడానికి స్నేహితులను, బంధువులను దూరం చేసుకోవడం జరిగిందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలుకి చెందిన ఓట్లు తొలగించి దొంగ ఓట్లు, నకిలీ ఓట్లు, చేర్చుకోవడంతోనే 2024 ఎన్నికల వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండానే వైఎస్ఆర్సిపి ఓడిపోయి, తెలుగుదేశం పార్టీ గెలిచిందన్నారు. ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం వల్ల ఆయన బలి పశువు అయ్యారని ఆరోపించారు. భాస్కర్ రెడ్డి అక్రమాలుకు పాలుపడినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు తెలిసినప్పటికీ కూడా ఆయనపై చర్యలు తీసుకోకపోవడంతో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల కమిషన్ కి ఫిర్యాదు చేయడంతో సీఈఓపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన వైఎస్సార్ నాయకులను ఆ పార్టీ అధిష్టానం ఏమి చర్యలు తీసుకుంటుందో వేచి చూడవలసిన అవసరం ఉందన్నారు. పదవి కాంక్షతో నైతిక విలువలను దిగజార్చుకుంటున్న విశ్వేశ్వరరెడ్డి ఇప్పటికైనా తమ విధానాలను మార్చుకోవాలన్నారు. సమావేశంలో ఉరవకొండ నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యదర్శి జె.మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, ఉరవకొండ కార్యదర్శి తలారి మల్లికార్జున పాల్గొన్నారు.

4న సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శిసి,జాఫర్

మాట్లాడుతున్న జాఫర్..

విశాలాంధ్ర-శింగనమల: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శింగనమల నియోజకవర్గ కమిటీ సమావేశం సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణ స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పెద్దయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్ లు హాజరైనారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామిలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎటువంటి మేలు చేయలేదని, అంబానీ, ఆదాని, లాంటి కుబేరులకు కొమ్ము కాస్తూ, పేదల నడ్డివిరుస్తూ పేదలకు మేలు జరిగే విధంగా మోడీ ప్రభుత్వం ఏనాడు చేయలేదని మండిపడ్డారు. మోడీ ఎన్ని కల ముందు అనేక వాగ్దానాలతో, మాయమాటలతో ప్రజలు నమ్మించి, వంచించి, అధికారంలోకి వచ్చి కులం, మతం, పేరుతో చిచ్చు పెట్టి విద్వేషాలు ప్రేరేపిస్తున్నారని, దేశ ప్రజలను అభద్రతాభావానికి గురి చేస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కులమత రాజకీయాలకు చిచ్చుపెట్టే నరేంద్రమోడీని సాగనంపుదామన్నారు. 4న ఏర్పాటుచేసిన కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కార్యక్రమంలో సిపిఐ శింగనమల మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి మర్రి స్వామి, రైతు సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ రామకృష్ణ , రాము పాల్గొన్నారు.

వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి

- పంచాయతీ ఈఓకు వార్డు సభ్యుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించడానికి తక్షణమే సాధారణ సమావేశాన్ని నిర్వహించాలని పంచాయతీ వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, మీనుగ రామాంజనేయులు, మీనుగా రవి, ముస్కిన్ సాహెబ్ సోమవారం గ్రామపంచాయతీ ఈవో గౌస్ సాబ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ జూన్ 23వ తేదీన సాధారణ సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమం ఉందని అర్ధాంతరంగా వాయిదా వేశారని. 60 రోజులు గడుస్తున్నప్పటికీ కూడా సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీలో సీజనల్ వ్యాధులు, తాగునీటి సమస్య పారిశుద్ధ్యం, గృహ నిర్మాణ అనుమతుల ఆమోదం, విద్యుత్ దీపాలు తదితర అనేక సమస్యలు నెలకొన్నాయని సమావేశంలో చర్చించి వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే సమావేశాన్ని నిర్వహించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిలాన్, రమేష్ పాల్గొన్నారు.

ఈక్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని విసి హాల్ నుంచి ఈక్రాప్ బుకింగ్, పిఎం కిసాన్, సివిల్ సప్లయిస్, రీసర్వే, నాడు-నేడు, ఉపాధి హామీ, స్పందన గ్రీవెన్స్, తదితర అంశాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్ లు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పొలాలకు అధికారులు వెళ్తున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. వీసీలో సిపిఓ ప్రశాంత్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, డిటిడబ్ల్యుఓ అన్నాదొర, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, డిఆర్డిఎ పిడి నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి

విశాలాంధ్ర-రాప్తాడు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వర్షాభావం తక్కువ కావడం వల్ల వేరుశనగ పంట తక్కువ సాగు అయిందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. సోమవారం వ్యవసాయ అధికారి పలు గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈఏడాది వర్షాభావం వల్ల ప్రధాన పంట వేరుశనగ 52% పరిమితమైనందున దాని స్థానంలో కంది, ఆముదం, మొక్కజొన్న పంటలకు ప్రాధాన్యం ఉన్నందున వాటిన సాగు చేసి సస్యరక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు

రజకులకు ఇచ్చిన ఇంటి పట్టాలు చూపాలి

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండల కేంద్రంలో రజక వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో పేద రజకులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాలు చూపించాలని తాహసిల్దార్ ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ముఖ్య అతిథులు ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు సి నాగప్ప హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద రజకులకు పట్టాలు ఇచ్చి ఆ స్థలాలు ఇంతవరకు చూపించలేదు ఆ స్థలాలు చూపించాలని, రజకులు పెద్దవడుగూరు బస్టాండ్ నుంచి గంగమ్మ గుడి తాహసిల్దార్ కార్యాలయాన్ని చేరుకోవడం జరిగింది. అక్కడ తాహసిల్దార్ తో రజకులకు ఇచ్చిన ఇంటి స్థలాలు ఏ స్థలంలో అయితే చూపించారో ఆ సలము వెంటనే రజకులకు ఆ స్థలం కల్పించాలని విజ్ఞప్తి చేశారు . తాహసిల్దార్ నాగభూషణం రజకుల ఉద్దేశించి మాట్లాడుతూ మీకు సంబంధించిన ఇంటి పట్టాలు పరిశీలించి మీ స్థలం మీకు అప్పచెప్తామని ప్రభుత్వం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా అవకాశం ఉంటే ఇల్లు గాని కట్టిస్తానని తెలియజేసరన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు గ్రామ రజకులు సిపిఐ మాజీ కార్యదర్శి హుస్సేన్ పీరా, సిపిఐ సీనియర్ నాయకులు లింగన్న సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలు లేని విద్యుత్ సరఫరా చేయండి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర- అనంతపురం రూరల్: కరెంటు కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సోమవారం సిపిఐ రూరల్ మండల కార్యదర్శి ఎం. రమేష్ అధ్యక్షతన విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా రైతులు రూ. లక్షలు పెట్టుబడులు పెట్టి బోరు బావుల కింద సాగు చేసుకుంటున్న పంటలకు విద్యుత్తు సరఫరా లేక పంటలకు నీళ్లు ఎప్పుడు సరఫరా చేయాలో విద్యుత్తు ఎప్పుడు వస్తుందోనని కాపలా ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో సైతం చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఆలస్యమైతే కనెక్షన్ తొలగించే అధికారులు నిత్యం కరెంటు కోతలు విధిస్తున్నారని వాపోయారు. అధికారులకు ఫోన్ చేసినా కూడా తీయని పరిస్థితులలో ఉన్నారని మండిపడ్డారు. వెంటనే నిరంతర విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండలంలోని రైతులతో పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి. రామకృష్ణ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రామాంజనేయులు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, రాప్తాడు మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర, ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, ఏఐటీయూసీ బళ్లారి రోడ్డుఅధ్యక్షుడు దుర్గాప్రసాద్, శాఖా కార్యదర్శులు జిపి ఓబులేసు, అజయ్ కుమార్, నల్లప్ప, వెంకటరాముడు, అక్కులన్న, గోవిందు, యోగేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీరాములు, ఎర్ర పోతన్న, నారాయణస్వామి, మల్లికార్జున, రెడ్డప్ప, నాగభూషణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఇంటి పట్టాలపై సిపిఐ నాయకుల గళం

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలో తహసిల్దార్‌కు మండలం సిపిఐ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సోమవారం అందించారు. కనేకల్ పట్టణంలోని సర్వే నంబర్ 41 లో గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2019లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిచి సర్వే ద్వారా ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా, ఇంటి స్థలాలు లేని నిరుపేదులను, గుర్తించి. వారికి మాత్రమే, స్థలం లేనివారి లిస్టు తయారు చేయగా 190 మంది తేలేరన్నారు. ఆ లిస్టు తీసుకుని గతంలో ఎమ్మార్వో కి అందించామని, ఎమ్మార్వో, ఆర్ ఐ, గ్రామస్థాయి వీఆర్వో, పేర్లను, మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి, ఆ లిస్టులో ఉన్నటువంటి నిరుపేదలకు 60 మంది గుర్తించి, వాళ్లను అర్హులుగా ఎన్నికైయారన్నారు. 60 మందికి మాత్రమే ప్రభుత్వం నుండి పట్టాలు మంజూరు చేశారన్నారు. వాళ్లకి ఇంటి స్థలాలు కూడా కేటాయించారు. కొన్ని కారణాలు, అనగా ఎన్నికల కోడ్ తెరపై రావడం వలన హౌసింగ్ వర్క్స్ అన్ని ఆగిపోయామని, తర్వాత కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, మరి గత ప్రభుత్వం హౌసింగ్ కి 1,50,000 రూపాయలు ఇచ్చిందని, అ నగుదు ఎటు మీకు సరిపోవని హౌసింగ్ ఏఈ చెప్పగా ఇప్పుడు ప్రభుత్వం రూ.3,00,000 ఇస్తుందని, కాబట్టి హౌసింగ్ అధికారులు మరోసారీ అప్లై చేసుకోమని చెప్పడం జరిగిందన్నారు. వాళ్లు రీ అప్లై చేసుకున్నారని, అయినప్పటికీ, ఏ ఒక్క ఇల్లు మంజూరు, చెయ్యని పాపం పోలేదన్నారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పి కాలాయాపన చేయకుండా వారికిపూర్తిగా అన్యాయం చేయాలన్నారు. వాళ్లకి ఇచ్చిన పట్టాలు నేరుగా తహసిల్దార్ కార్యాలయంకు, తిరిగి వెనక్కి పంపించారని సిపిఐ నాయకులు విచారించగా ఆ 60 మంది పట్టాలు తహసిల్దార్ పరిధిలోకి వెళ్లాయని తెలిసింది. తహసిల్దార్ ని అడగగా కొంతమందికి విద్యుత్ కనెక్షన్, ఆధార్ కార్డ్, లింకు, ఉంది అని మరి కొందరికి హౌసింగ్ టాక్స్, వస్తుంది అని చెప్పారన్నారు. కేవలం వారు చెప్పేదాన్ని బట్టి చూస్తే 12 మంది మాత్రమే ఎలిజిబుల్‌గా ఉన్నారన్నారు. వారికి పట్టాలు మంజూరి చేస్తాం అనడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 60 మందికి పట్టాలు మంజూరి చేశారు. ఇప్పుడు మిగిలిన వారికి కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరుపేదలతో తహసిల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం. గౌస్ పీర్, మండల సహాయ కార్యదర్శి ఎస్ బషీర్ అహ్మద్, పట్టణ కార్యదర్శి కే మహబూబ్ బాషా, పట్టణ సహాయ కార్యదర్శి మన్సూర్ భాష, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సంఘం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి ప్రసాద్, మహిళ ఆఫీస్ బేరర్ ముళ్ళ శర్మాస్ బి, అలాగే పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ పరిష్కరించే ముందు అర్జీదారునికి ఫోన్ చేసి మాట్లాడాలి

- కలెక్టర్ యం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచేలా నాణ్యత కలిగిన పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ యం.గౌతమి ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తోపాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, నీలమయ్య, డిఆర్డిఏ పిడి నరసింహారెడ్డి, మెప్మా పిడి వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 408 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ గడువులోపు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రీవెన్స్ పరిష్కారం పై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రశాంత్ కుమార్, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, డిటిడబ్ల్యుఓ అన్నాదొర, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, ఫిషరీస్ డిడి శాంతి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించే వరకు మా పోరాటం ఆగదు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం లో 10వేలు వరకు దొంగ ఓట్లు నమోదయి ఉన్నాయని వాటన్నింటినీ తొలగించేంతవరకు కూడా పోరాటం చేస్తానని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు వ్యవహారంలో అధికారులు సస్పెన్షన్ పై టీడీపీ హంగామా చేస్తుందని తెలిపారు. వాస్తవానికి 2019 -20, 21 సంవత్సరాలలో ఓటర్ల సవరణ సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు మరణించిన వారికి సంబంధించి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నోటీస్ ఇవ్వక పోవడంతో కేవలం ప్రొసీజర్‌ను తప్పు పట్టిందని అందువల్లనే ఎన్నికల కమిషన్ వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయడమే జరిగిందన్నారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనకు (వేరిఫికేషన్) అధికారుల సస్పెన్షన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.ప్రస్తుతం ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపు 10 వేల ఓట్లు చనిపోయిన వారి, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, రెండు చోట్లా ఓట్లు కలిగిన వారు ఉన్నారని వాటన్నింటినీ పై సమగ్ర విచారణ జరిపించాలని నియమ, నిబంధనలను అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు తాము పిర్యాదు చేసినట్లు వెల్లడిం చారు. కౌకుంట్ల పంచాయతీ పరిధిలోని డిబిటి ద్వారా 11 కోట్లు, నాన్ డిబిటి ద్వారా 20 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని దీనిపై విశ్వవాసాన్ని చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పెళ్లికి రూ.10వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-శింగనమల: జలాలపురం గ్రామంలో నివాసంఉంటున్న యం.రాములమ్మ, యం.ఆదినారాయణ కుమారుడు యం.బాలు వివాహంకు 10వేల రూపాయిలు, అలాగే శింగనమల గ్రామానికి చెందిన యం.గోల్లప్ప కుమారుడు ప్రేమ్ నాథ్ వివాహానికి పదివేల రూపాయలు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరమని, వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుళ్ళాయప్ప, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, శింగనమల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణ స్వామి, ముంతావెంకటేష్, రంగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

స్పందన పిటీషన్లకు నిర్ణీత వ్యవధిలోనే పరిష్కారం చూపండి : ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు సోమవారం నిర్వహించిన " స్పందన " కార్యక్రమంలో 104 పిటీషన్లు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి విచ్చేసిన ప్రతీ పిటీషనర్ తో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి స్పందన పిటీషన్లకు పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.రామకృష్ణ, నాగభూషణం, నారాణరావు, ఎస్పీ సి.ఐ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తాడిపత్రి: ఈనెల 24వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై విజయవాడలో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద నుండి బైకుల మీద ర్యాలీ నిర్వహించారు. ఈ బైకు ర్యాలీని అంగన్వాడి యూనియన్ నాయకురాలు జ్యోతి లత ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పైన ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకురాలు జ్యోతి లత పంచాయతీ యూనియన్ కార్మికురాలు సంధ్య భాయ్ ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు జరీనా మున్సిపల్ కార్మికులు ప్రసాదు, జుబేర్, ఓబయ్య, వన్నూరప్ప, నరసింహమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

వర్షం కోసం.. బొడ్రాయికి 1001 టెంకాయలతో పూజలు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లాలో వరుణుడి కరుణాకటాక్షాల కోసం రైతులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం కళ్యాణదుర్గం పట్టణంలోని కోటలో వెలసిన రామస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పక్కనే ఉన్న బొడ్రాయికి 1001 టెంకాయలు కొట్టి వరుణ దేవుణ్ణి భూమి మీదకు రావాలని వేడుకున్నారు. నరసింహ స్వామి ఆలయంలో, ఊరు చెరువులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు, రైతులు, మహిళలు విశేష పూజలు వర్షం రావాలి... పంటలు పండాలి అంటూ నినదించారు. పలు గ్రామాల్లో గాడిదలకు పెళ్లిళ్లు చేశారు.

సివిల్ సప్లైస్ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా పెద్దన్న

విశాలాంధ్ర-కూడేరు: పెద్దన్న చేసిన సామాజిక సేవలకు మంచి గుర్తింపు లభించింది. విహెచ్‌పిఎస్.రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న ఆయనకు సివిల్ సప్లైస్ జిల్లా మానటరింగ్ కమిటీ/ఫుడ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికైనారు. కలెక్టర్ గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దన్న మాట్లాడుతూ పేద ప్రజ లకు అవినీతికి తావులేకుండా నిత్యావసర సరు కులు అందేలా ఉన్నతాధికారులతో కలసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోండి : సీపీఐ

▸ సిపిఐ పార్టీ నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలంలోని మాల్యవంతం మట్టి మాఫియా పై చర్యలు గైకొనాలని కోరుతూ సోమవారం సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మధు డీఎస్పీ శ్రీనివాసులకు వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మండలంలోని మాల్యవంతం వద్ద ఉన్న చెరువు లోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించుకొని సొమ్ము చేసుకుంటు న్నారని ఆరోపించారు. పలుమార్లు తహసిల్దార్ కు మాల్యవంతం సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రైతులకు ఉపయోగపడే మట్టిని కొందరు అధికార పార్టీ అండదండలతో అక్రమంగా తరలించుకుంటున్నారు. సిపిఐ మండల నాయకులు చెరువు వద్దకు వెళ్లడంతో అక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుడు దురుసుగా ప్రవర్తించి, దాడి చేయడానికి వచ్చారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై ఉన్న కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుల్లాయప్ప,సిపిఐ పట్టణ కార్యదర్శి రవి కుమార్, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి రమణ,ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పోతులయ్య, పట్టణ నాయకులు సాయికిరణ్, పురుషోత్తం సునీల్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జాత బస్సు యాత్రకు తరలిరండి : కాటమయ్య

విశాలాంధ్ర-మడకశిర: ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో రివర్స్ పాలన వలన అభివృద్ధి నత్త నడకలా నడుస్తోందని సిపిఐ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఏ కాటమయ్య అభిప్రాయపడ్డారు. సోమవారం స్థానిక పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఏ కాటమయ్య సమక్షంలో నియోజకవర్గ కార్యదర్శి భాగ్యమ్మ,మడకశిర,గుడిబండ మండలాల ఇన్చార్జి ఆర్ జి పవిత్ర ఆధ్వర్యంలో సిపిఐ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ఎంఆర్పిఎస్ నాయకులు సైతం హాజరై తమ మద్దతును తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఏ కాటమయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజా సంక్షేమం పట్ల గాని ప్రజల పట్ల గాని ఎలాంటి చిత్తశుద్ధి లేదని రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చేది గోరంత దోచేది కొండంత అన్న చందాగా తయారైందని సీఎం తీరుపై మండిపడ్డారు.రాష్ట్రంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేస్తానన్న మాట తుంగలో తొక్కి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేక నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.జగన్మోహన్ రెడ్డి పోలీసు పహారా మధ్య ఇంటికే పరిమితమై నియంత పాలన సాగిస్తూ రాష్ట్ర ప్రజలను బానిసలుగా భావించడం హేయమైన చర్య అని ఎద్దేవా చేశారు. అహంకారంతో ముఖ్యమంత్రి విర్రవీగుతున్నారని, ముఖ్యమంత్రి తీరుకు నిరసనగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ప్రచార జాతా బస్సు యాత్రను సెప్టెంబర్ 5న కదిరిలో బహిరంగ సభ చేపట్టిందని దీనికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాల్సిందిగా ఆయన మనవి చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ చరిత్ర హీనుడుగా మిగిలిపోతారని ధ్వజ మెత్తారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరివేంద్ర, నియోజకవర్గ కార్యదర్శి భాగ్యమ్మ, పవిత్ర, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి, తాలూకా అధ్యక్షులు ముత్యాలు పాల్గొన్నారు.

సామాజికవేత్త కార్యాలయంపై దాడి హేయం

విశాలాంధ్ర-కదిరి: సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్ కార్యాలయంపై వైసీపీ నాయకులు చేసిన దాడి హేయమైన చర్యని డివిజన్ యాదవ సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ భూలోకం శ్రీరాముల యాదవ్ తెలిపారు. సోమవారం యాదవ సంఘం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో కులం,మతం అన్న తేడా లేకుండా ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్న పేద ప్రజలకు తన సొంత ఖర్చులతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించే వారన్నారు. ఇది జీర్ణించుకోలేని కొంతమంది వైసీపీ నాయకులు రాజ గోపాల్ యాదవ్ కార్యాలయంపై దాడులు చేయడమే కాకుండా అతనిపై తిరిగి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-కదిరి: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులర్ చేయాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఆర్ అండ్‌బి బంగ్లా నుండి అంబేద్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, జీమాన్ సర్కిల్, ఎగ్బాల్ రోడ్, హిందూపూర్ క్రాస్ టవర్ క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు జనార్ధన, కార్యదర్శి బాల కృష్ణ, జిల్లా కోశాధికారి తిరుపాలు, నరసింహమూర్తి, రాజు, చెన్న కృష్ణ, రామాంజులు, చంద్రప్ప సిఐటియు నాయకులు జి.ఎల్. నరసింహులు, సాంబశివ, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తక్, నారాయణ పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ఎన్ పీ కుంట: శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించు కుని వంకమద్ది గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో గ్రామ ప్రజలు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు ఒకరోజు భజన కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. మహోత్సవానికి చూసేందుకు వంకమద్ది, నంబుల పూలకుంట , గురికాని వారి పల్లి ,పెదరాంపల్లి, పోరెడ్డి వారి పల్లి, నల్లగుట్టపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో మంచి వర్షాలు కురిసే మంచి పాడిపంటలు పండాలని స్వామివారికి పూజ చేసినట్లు ఆలయ పండితులు తెలిపారుఅన్నదానం చేశారు.

సర్వసభ్య సమావేశంలో .. సమస్యల వెల్లువ

విశాలాంధ్ర-రొద్దం: సత్యసాయి జిల్లా స్థానిక వెలుగు సమావేశ భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు తమ గ్రామాల ప్రజా సమస్యలు కరెంటు, బిల్లులుచెల్లింపులు ఉపాధి హామీ సిబ్బంది కొరత, స్థానిక పంచాయతీ శుద్ధ జల కేంద్రమునివేయడం సచివాలయ సిబ్బంది మండల స్థాయి అధికారులు విధులకు గైర్హాజరు తదితర సమస్యల, సర్వసభ్య సమావేశంలో సమస్యలు అధికారుల ముందు ప్రజాప్రతిని ముందు సమావేశంలో లేవనెత్తారు, సమస్య పరిష్కరించే దిశగా పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశంలో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నరసయ్య, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తాహసిల్దార్ అనంత ఆచారి, ఎంపిపి చంద్రశేఖర్, స్వచ్ఛంద రాష్ట్ర డైరెక్టర్ బి. నారాయణ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: సత్యసాయి జిల్లాలోని 32 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జేవి రమణ పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సత్యసాయి జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నేపథ్యంలో అన్నదాతల ఆత్మ హత్యలు వలసలతో జిల్లా అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రత్యేక ప్యాకే జీలు ఇచ్చి ఆదుకోవాల్సిన పాలకవర్గాలు మొద్దు నిద్ర నటిస్తున్నా యని ఆరోపించారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో దశాబ్దాల పాటు కరువు విలయతాండవం చేస్తుంటే అక్కడి ప్రభుత్వం వేయి కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అమలుపరిచి ఆ ప్రాంతాన్ని ఆదుకుం దన్నారు. విదర్భ తరహా ప్రత్యేక ప్యాకేజీని సత్యసాయి జిల్లాకి అమలు చేయాలని కోరారు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు అడపాల వేమనారాయణ, గౌస్ లాజం తదితరులు పాల్గొన్నారు.

సిడబ్ల్యూసి మెంబర్‌గా రఘువీరా ఎంపికపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర - అగళి : ఏఐసిసి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు మాజీ పి సిసి అధ్యక్షులు రఘువీరారెడ్డిని సిడబ్ల్యూసి సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు లోకేష్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి బస్టాండ్ కు చేరుకొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బాణసంచాలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చిక్కవన్నప్ప, రాజు, నరసింహప్ప, టైలర్ కృష్ణ, త్యాగరాజు, దేవరాజు, గోవిందప్ప, నరసప్ప, సన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రక్తం అవసరం ఉన్నవారికి, రక్త నిధి ద్వారా అందిస్తాం..

విశాలాంధ్ర-ధర్మవరం: రక్తం అవసరం ఉన్నవారికి రక్త నిధి ద్వారా తగినంత రక్తమును అందజేయడం జరుగుతుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్. డాక్టర్. నజీర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పెథాలజిస్ట్ డాక్టర్. వైష్ణవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణము గ్రామీణ ప్రజలకు అత్యవసరమైన సమయాలలో రక్తము కొరకు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి యందు రక్త నిధి కేంద్రము ఉన్నదని (బ్లడ్ స్టోరేజ్ సెంటర్), దీనిద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ, రక్తము అవసరమున్నవారికి ఏ గ్రూపులో అయినా ఉచితంగా అందించి, వైద్య చికిత్సలను అందిస్తా మన్నారు. పేషెంట్లకు బ్యాంక్ అకౌంట్ బార్కోడ్ ద్వారా 800 రూపాయలు చెల్లించితే రక్తమును పొందే అవకాశం ఉందని తెలిపారు రక్తదానం చేసేవారు (దాదాపు 30 మంది) కూడా బ్లడ్ స్టోరేజ్ నిర్వాహకుడు హరిప్రసాద్ సెల్ నెంబర్.. 94 92 600 559 కు ఫోన్ చేస్తే స్వీకరించడం జరుగుతుం దన్నారు. తప్పక ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను పొందవచ్చునని తెలిపారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- ఈ కుట్రలో భాగస్వాములు అయినవారికి వడ్డీతో సహా చెల్లిస్తాం : జనసేన ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్, చిలుమత్తూరు మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్ లు స్థానిక ప్రెస్ క్లబ్ నందు సోమవారం పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ, గత 20 రోజుల క్రితం జనసేన పార్టీ నాయకులపై ఓ మోసకారి మాటలు నమ్మి, అధికార పార్టీ నాయకులు మోస కారికి మద్దతుగా కర్ణాటక పోలీసుల పై ఒత్తిడి తెచ్చి కేసులు బనాయించడం హేయమైన చర్య అన్నారు. కదిరి నియోజకవర్గానికి చెందిన రమేష్ బాబు అనే వ్యక్తి మాంగల్య సిల్క్ హౌస్ కు లోను ఇప్పిస్తానని చెప్పి మూడు లక్షలు రూపాయల నగదు తీసుకొని లోను రాకపోవడంతో, తీరా ఆరాధిస్తే అతను మాకు అబద్ధాలు చెప్పి మోసం చేశాడని తెలుసుకొన్నాము. కర్ణాటక సరిహద్దులో బాగేపల్లి వద్ద ఒక రెస్టారెంట్ సమీపంలో రమేష్ బాబు కనిపించగా, మాకు ఇవ్వాల్సిన డబ్బు ఎప్పుడూ ఇస్తావని అడగగా, రమేష్ బాబు డబ్బులు ఇవ్వనని తమపై వాగ్వాదం చేయడంతో బాగేపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే, మరో రెండు నెలల్లో డబ్బులు ఇస్తానని రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. రమేష్ బాబుకు హిందుపురం నియోజకవర్గంలో కొంతమంది నాయకులు అండగా నిలుస్తూ, తమపై లేనిపోని నిందలు వేస్తూ బాగేపల్లి పోలీస్ స్టేషన్లో రమేష్ బాబుకి డబ్బులు ఇచ్చిన పాపానికి తమపైనే అక్రమంగా కేసు నమోదు చేయించి ఎఫ్ఐఆర్ చేశారన్నారు. హైకోర్టుకు వెళ్లి తమ మనోభావాలు దెబ్బతీసిన వారిపైన చర్యలు తీసుకునేందుకు కోర్టుకు వెళతామని తెలిపారు. జనసేన నాయకులు జిల్లా కార్యదర్శి రాహుల్ ఐ సి. రమణ, పట్టణ అధ్యక్షులు శేఖర్, బొంచేరువు భాస్కర్, గాజుల నాగభూషణం, కిషోర్ తేజస్, అంజినేయలు, లక్ష్మనమూర్తి, నవీన్, ప్రభు, మనిప్రియ, శేఖర్ కన్నా పాల్గొన్నారు.

లడ్డూ లక్ష్మీనారాయణ మృతి పట్ల సంతాపం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆదర్శ సేవా సంఘం సభ్యులైన లడ్డు లక్ష్మీనారాయణ సోమవారం బెంగళూరులో వైద్య చికిత్సలు పొందుతూ, ఆకస్మికంగా మృతి చెందారు. వ్యాపారస్తులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వారి మృతికి సంతాపం తెలిపారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు పిట్టా వెంకటస్వామి, క్లబ్బు సభ్యులు జగదీష్, పళ్లెం వేణుగోపాల్, గోశే రాధాకృష్ణ మాట్లాడుతూ మృతి చెందిన లక్ష్మీనారా యణ మృదు స్వభావం కలవారని, ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ, ఎంతోమంది పేదలను ఆదుకున్న ఘనత వారికే దక్కిందన్నారు. లక్ష్మీనారాయణకు ఘన నివాళులు అర్పించారు. లక్ష్మీనారాయణ సేవలు అనన్యమైనవని కొనియాడారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-ధర్మవరం: దోమల ద్వారా వ్యాపించు వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ నాయక్ ఎస్సిఓ జయరాం నాయక్ ఆధ్వర్యంలో ఎస్సికే పురం ఉన్నత పాఠశాల లో దోమల ద్వారా వ్యాపించు వ్యాధుల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ యొక్క లార్వాదశ నుంచి దోమ నుండి సంభవించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, టైఫాయిడ్ ఎలా సంభవిస్తుంది? వాటి నుంచి నివారణ చర్యలు గూర్చి తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- పవన్ సిద్ధాంతాలకు అనుగుణంగా నడక సాగిద్దాం
- కొట్టికుమార్ ఆధ్వర్యంలో గుమ్మం వద్దకే జనసేన ..

విశాలాంధ్ర-తనకల్లు: పవన్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఆయన ఆశయా లను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా చేపట్టిన గుమ్మం వద్దకే జనసేన కార్యక్రమాన్ని కొట్టి కుమార్ ఆధ్వర్యంలో జంబులింగేశ్వర స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు జన సైనికులు వీర మహిళలు గుమ్మం వద్దకే జనసేన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుమ్మం గుమ్మం తిరుగుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను మేని ఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఈ కుళ్ళు కుతంత్ర రాజకీయాలకు విముక్తి పలకాలంటే 2024లో జనసేన పార్టీకి అధికారం ఇవ్వా లని కోరారు. ఈ పీడిత రాజకీయాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు నష్టం వాటిల్లు తోందని, అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలనెదే జనసేన ఆశయమన్నారు. మహిళలకు 33% రాజకీయ రిజర్వేషన్లు, ఉచిత సిలిండర్లు, రేషన్‌కు బదులుగా రూ.2,500 నుండి రూ.3,500 వారి అకౌంట్లో జమ చేయడం, బీసీలకు అవకాశాన్ని బట్టి ఐదు పర్సెంట్ రిజర్వేషన్లు కల్పించడం, ఇవే కాక రైతులకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు జనసేన మేనిఫెస్టోలో ఉన్నాయని, 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడంలో ప్రజలంతా సహకరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ, బాలసముద్రం ఎంపీటీసీ అమర, కార్తికేయ, మండల కన్వీనర్ కె.వి రమణ, ముని కుమార్, యోగానంద, ఫయాజ్ రెడ్డి, శ్రీనివాసులు ,నల్లచెరువు మండల కన్వీనర్ రవీంద్ర, మేకల చెరువు చౌదరి మరియు జన సైనికులు పాల్గొన్నారు.

దేవాలయం, మసీదులకు విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 28వ వార్డు కేతిరెడ్డి కాలనీలో పీర్ల చావిడికి అక్కడే గల ఆంజనేయ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం 28వ వార్డ్ ఇంచార్జ్ సరితల భాష తనవంతుగా 40 వేల రూపాయల నగదు విరాళములు వారు అందజేశారు. సరితల భాష మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దైవ భక్తితో పాటు, దైవ ధన సహాయాలు కూడా చేయాలని తెలిపారు. ప్రతి మనిషి చేసే పనిపై దైవాశీస్సులు తప్పక ఉంటాయని తెలిపారు. సరితాల భాష కుమార్తె విద్య జాస్మిన్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30వ తేదీ నుంచి రాఘవేంద్ర స్వామి 352వ ఆరాధన మహోత్సవం

- ఆలయ మేనేజర్ రమేష్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారి మఠము శాఖ అయిన శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయం దేవాలయంలో 352వ ఆరాధన మహోత్సవ వేడుకలను ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ రెండవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ రమేష్, అర్చకులు బద్రీనాథ్, భరద్వాజ్, వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 30వ తేదీన ఉపాకర్మ ధ్వజారోహణం గోపూజ లక్ష్మి ధాన్య పూజలు ,31వ తేదీన పూర్వారాధన లో విశేష పల పంచామృతాభిషేకము, కనక మహా పూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము, సాంస్కృతిక కార్యక్రమాలు, పల్లకి సేవ, సెప్టెంబర్ 1వ తేదీన మధ్యారాధన లో విశేష పల పంచామృతాభిషేకం, కనక మహా పూజ, పల్లకి సేవ, ప్రత్యేక అలంకరణ, బాబు బాలాజీ గ్రూప్ ధర్మవరం వారిచే నృత్య ప్రదర్శన, సెప్టెంబర్ 2వ తేదీన ఉత్తరాదన లో రథోత్సవం, స్వస్తివాచనం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. దాతలు నగదు లేదా వస్తురూపేణ విరాళాలను అందించవచ్చునని తెలిపారు.

అసైన్మెంట్ భూములు స్వాధీనం చేసుకున్నాం

విశాలాంధ్ర-లేపాక్షి: ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్మెంట్ భూములను మండలంలోని కొం దూరు, కొర్లకుంట, గ్రామాలకు చెందిన రైతులు కుశలవ ఆర్గానిక్ ప్రొడక్ట్ యాజమాన్యానికి విక్ర యించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య పేర్కొన్నారు. వారం రోజులుగా కొందరు రైతులు తమ భూములను తమకే కేటాయించాలని తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం విధితమే. సోమవారం సాయం త్రం తహసిల్దార్ కార్యాలయంలో పలు రెవిన్యూ రికార్డులను పరిశీలించి అనంతరం నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో సమావేశమై చర్చిం చారు. 90 రోజులలోపు కుశలవ యాజమాన్యం, రైతులు అప్పీల్ పోవడానికి అవకాశం వుందని తెలిపారు..

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-రొళ్ల: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మడకశిర శాసనసభ్యులు డాక్టర్. ఎం.తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట కల్లురొప్పం గ్రామా లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన వివరాల బుక్లెట్ ను వారికి అంద జేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అంది స్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుం దన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేని అభివృద్ధి పనులతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల పాలనలో 95 శాతానికి పైగా నెరవేర్చాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీ వో కలువది ఆజాద్, ఎస్సైలు లోకేష్, ముని ప్రతాప్, ఏఎస్ఐ బాలాజీ, ఎంఈఓ శ్రీధర్, హౌసింగ్ ఏఈ మాసప్ప, ఏపీవో ఓబులప్ప, పంచా యతీ కార్య దర్శి దాసరి శ్రీనాథ్, వీఆర్వో వేణుగోపాల్, వెల్ఫేర్ అసిస్టెంట్ దేవరాజు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు లేకపోవడంతో జడ్పీటీసీ ఉమేష్ నిరసన

విశాలాంధ్ర - అగళి : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గత వారం రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో జడ్పీటీసీ ఉమేష్ నాయకులతో కలిసి చెత్తకుప్ప దగ్గర నిలబడి నిరసన తెలిపారు. గత వారం రోజులుగా చెత్త ను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని, ప్రజలు ఛీపరించుకొని వెలుతున్నా అధికారులు ఏ మాత్రం చెత్త తరలించడానికి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకుపోయిన చెత్తలో దోమలు వృద్ధి చెందడం కాకుండా పందులు స్వైర విహారం చేస్తున్నాయని, తద్వారా డెంగీ వైరల్ జ్వరం ప్రబలే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులందరినీపర్మనెంట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అక్రమ అరెస్టులు చేసిపోలీస్ స్టేషన్స్ లో నిర్బంధించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లని, గ్రాడ్యుటీ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సమస్యను పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికు లకు హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నాయకులు రామయ్య, గోవిందు, నాగార్జున, పెద్దన్న, ఇంజనీ రింగ్ యూనియన్ నాయకులు, రమణ, సద్దాం హుస్సేన్, గంగాద్రి, గణేష్,రాందాసు, పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

విశాలాంధ్ర-ఎన్‌పీ కుంట: మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శ్రీ సత్య సాయి జిల్లా డీఈఓ మీనాక్షి సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఇన్ఫోకు సంబంధించిన రికార్డులను డిఈ ఓ తనిఖీ చేశారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం నూతనంగా తీసుకొచ్చిన ట్యాబులను వినియోగించుకునే విధంగా చూడాలని పాఠశాల హెచ్ఎం కు చూసించారు. బైజుస్ ద్వారా పిల్లలు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడ తాయన్నారు. రికార్డులను తనిఖీ చేసి, ట్యాబుల వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఆర్జెడికే అందించనున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై ర్యాలీ

విశాలాంధ్ర-ధర్మవరం: సింగిల్ యూస్ ప్లాస్టిక్ సేకరణ లో భాగంగా పట్టణంలోని శ్రీ సత్య కృపా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు సోమవారం ప్లాస్టిక్ వాడకం పై వచ్చే అనర్థాలను తెలిపేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినిలు పలు కూడలిలో ర్యాలీలను నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డోల పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల భవిష్యత్ తరాలకు అది అనర్థాలుగా తయారవుతుందని కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థినీలు పాల్గొన్నారు.

అశ్రునివాళి

కీ॥శే॥ శ్రీ లడ్డు లక్ష్మినారాయణ
Ex LionsClub Member
లయన్స్ క్లబ్ 316J
ధర్మవరం . శ్రీ సత్యసాయి జిల్లా.